# మార్పుకి మరో పేరు

రంగారావుకి తండ్రి దగ్గరనుంచి వచ్చిన తంతి చూడగానే కాళ్ళలోంచి దడ వచ్చినంతపని అయింది. నెమ్మదిగా వంట గదిలోకి చేరాడు.

"చూడు రాజ్యం! నాన్న దగ్గరనుంచి టెలిగ్రాము వచ్చింది మా అమ్మ, చెల్లెలు వస్తున్నారట. ఈపూట స్టేషనుకు వెళ్లాలి" అని నీళ్లు నములుతూ భార్యకి చెప్పాడు.

ఆ మాట వినగానే తరుగుతున్న వంకాయను కిందపడేసి తెల్లబోయి మాటలేకుండా రంగారావు మొహంలోకి చూస్తూ వుండిపోయింది రాజ్యం.

"నా మాటేమిటి? తొందరగా ఏదయినా ఆలోచించు నాకేం తట్టడంలేదు," అంటూ చిరాగ్గా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

"పోనీ, నేనీ పూట మావాళ్ల వూరికి బయలుదేరనా?"

"పూటా? అంత గడువేవుంటే నిన్ను సలహాలడగాలా? ఇంకో గంటలో వాళ్లు రానే వస్తారు? ఏం చెయ్యడానికి పాలు పోవడంలేదు." అంటూ కిటికీ వూచల్లో మొహం పెట్టుకుని ఆలోచనల్ని రోడ్డులో వెతుకుతున్నాడు రంగారావు.

"వస్తేరానివ్వండి. నేనేం తప్పు చేశాను? మీ దగ్గరేగా వుంటా? మీరుమాత్రం వాళ్లు రాగానే వాళ్ళతో మమేకం అవకపోతేచాలు ఏం చేస్తారో చేస్తాను," అని పైకి అన్నా, భయంతో కాళ్ళు, చేతులు చెమ్మగిల్లాయి రాజ్యానికి.

ఇంతలో మెట్లకింద ఒక కంఠం "అబ్బాయి రంగారావు" అని గావుకేక పెట్టడం వినపడి, చైతన్యం తప్పి కింద చతికిల పడ్డాడు రంగారావు. "వో పని చేస్తే? మీకు వంట్లో బాగా

లేదు అని చెపుతాను మీరు పడుకోండి." రాజ్యం సలహా పూర్తికాకుండానే తలుపులు దడదడలాడుతున్నాయి. రంగారావు మంచం ఎక్కి ముసుగుపెట్టాడు. రాజ్యం తల్లో పువ్వుల దండ తీసి సొరగులో పడేసి, కొత్తచీర గబగబా కట్టుకునే లోపల తలుపులు దడతగ్గి పెద్ద శబ్దంతో, పిట్టగోడమీదికి వరిగాయి. అత్తగారు ఎకాయెకీ రాజ్యం వున్న చోటుకి వచ్చి "హయ్యో, నువ్వు ఇక్కడే వున్నావా" అంటూ వక్కవురుము వురిమి "వాడేడీ" అంటూ పక్కగదిలోకి వెళ్ళింది. ఆడపడుచు నాగరత్నం వొదినగార్ని పరీక్షగా చూస్తూ "నువ్వు ఎప్పుడొచ్చావు? నిన్ను తీసుకురానని వ్రాశాడుగా?" అంటూ మూతి తిప్పుతూ తల్లి వున్నచోటుకి వెళ్ళింది.

పక్కగదిలో కాంతమ్మగారు అంటోంది, మాకు జరిగిన అవమానం ఎలా మరవగలిగావు? ఏ మొహమెట్టుకుని దాన్ని గడపతొక్కనిచ్చావంట; హు. నిన్నానాల్సిన పని లేదులే? మీ నాన్నకి ఇంగితంవుంటే ఇంతంత ఘాతుకాలు జరిగేవేకాదు." అంటూ రంగారావు కప్పుకున్న ముసుగు, వక్క విసురున తీసి "ఏమిటి జబ్బు?" అంటూ వళ్లుఅంతా తడిమింది.

అప్పటికే భయంతో వళ్ళు అంతా నీరు కమ్మినట్టువుంది రంగారవుకు. వీళ్లు ఇప్పుడు ఎందుకు వచ్చినట్టు? తండ్రికి ఎవరయినా తనకి తెలియకుండా వుత్తరంవ్రాశారా? ఒకవేళ అల్లా జరిగితే ఆయనే వస్తాడు కాని, వీళ్ల ఇద్దరికి రైలుఖర్చులుపెట్టి పంపేరకం కాదని కొంత ధైర్యం తెచ్చుకొన్నాడు.

"హయ్యో, వళ్ళు ఇంత చల్లగా వుందేంరా? ఎన్ని లంఖణాలు ఇవాళ్టికి? అయినా వక్కకార్డు ముక్క వ్రాయలని దానికైనా తోచలా? మేము బతికే వున్నాంగా. ఇప్పుడైనా అర్థమయిందా? ఎర్రగా, బుర్రగా వుందని మాకు చెప్పకుండా మళ్ళీ దాన్ని తెచ్చుకున్నావు. దీని పిన్నమ్మ సంగతి రాత్రి రైల్లో, వకాయన చెపితే, మాకు తలకొట్టేసినట్టు అయిందనుకో" కాంతమ్మ ముక్కు తుడుచుకుంటూ విశాలంగా పైకి జరిగి కూర్చుంది.

కూరవాసనకి తట్టుకోలేక నాగర్నాతనికి నోరు వూరుతోంది. నిన్ననగా తిన్నతిండి, పైగా తండ్రి ఎప్పుడూ వుడకపెట్టిన కూరలు తప్ప వండనివ్వడు. తల్లి అందులో ఇంకా పొదుపుచేసి పోపులేకుండా పొడికారంతో సరిపెట్టి డబ్బుచేస్తుందాయె. వాళ్ల ఇంటికి బంధువులు వచ్చినా పక్కవూళ్ళోభోంచేసి మరీ వస్తారు. తండ్రి ఎవరింటికీ వెళ్ళడూ, ఎవర్నీ వెళ్లేందుకు ఒప్పుకునే ఘటం కాదు. ఇప్పుడైనా తన పెళ్లి తిరపతిలో చేస్తున్నారుకనక, ఇంతకీ అమ్మగోల పెట్టిందని పట్నంరానిచ్చాడు. "కూరమాడువాసన వస్తూన్నట్టుంది. చూడమను. ఆ గుడ్డలతో వుడకేస్తుంది. నేను తిననిచెప్పు' అంటూ గోళ్ళతో తల దువ్వుకుంటూ కాంతమ్మ, నాగరత్నానికి చెప్పింది.

వంటింట్లో సామాన్లన్నీ మూతలుతీసి నూనెవంకాయని చూడగానే చేతిలోకి తీసుకోబోయి, వేడికి కిందవదలి, మళ్ళీ దాన్ని గిన్నెలో వేసింది నాగరత్నం. పచ్చడిచేసే రాజ్యం "అదేమిటి కిందపడిందాన్ని మళ్ళీ అందులో వేస్తున్నావు" అంది.

పళ్ళెంలోకి తీసుకుని తల్లిదగ్గరకు వెడుతూ, "మహచెప్పావులే. ఎవరెరుగరూ మీవాళ్ళింట్లో సుబ్బరం. అయినా సిగ్గులేదు. వాడిని వెర్రివాడినిచేసి వచ్చి కూర్చుంది. నాన్నకి తెలిస్తే వదిలిపోతుంది ఈ బడాయి." అంటూ వదినగారిమీద దండకం చదువుతూ వోమూల వున్న ట్రంకుపెట్టిమీద కూలబడింది నాగరత్నం.

"ఏమిటే తింటున్నావు ఇల్లారా చూస్తాను" అంటూ కూతురు చేతిలో పళ్ళెం అందుకుంది కాంతమ్మ. రంగారావుకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తనెంతో మనసుపడి లేత వంకాయలు తెచ్చుకుంటే, తనకి దక్కనిచ్చేటట్టులేరు. పైగా తన తెలివతక్కువకొద్దీ వంట్లో బాగా లేదని పడుకున్నాడు. తన్ను తల్లి వారందాకా చారునీళ్లు తప్ప మరొకటి ముట్టుకో న్వివదని గుర్తుకి రాగానే, ఆకలి మరీ ఎక్కువయింది. పళ్ళెంలో వంకాయల్లోంచి నూనె కారుతుంటే ఆ వాసనకి

తట్టుకోలేక, "ఈ పూటకి మడి అఖ్ఖర్లేదని చెప్పు. రేపు ఎలాగా నేనేమడిగా చేసుకుంటా' నంటూ సమాధానపడింది, కాంతమ్మ.

తల్లీ చెల్లెలూ నీళ్లగదివేపు వెళ్ళడంచూసి రంగారావు నెమ్మదిగా వంటింట్లోకి వచ్చి "రాజ్యం నాకు వడ్డించు తొందరగా" అని పీటమీద కూలబడ్డాడు. ఆత్రంగా వంకాయ కలుపుకుంటూండగానే నాగరత్నం తల్లిని గావుకేకపెట్టింది. వళ్లయినా తుడుచుకోకుండా చీర సగం చుటుకువచ్చి పడింది కాంతమ్మ. "నీకేం పోయేకాలమే లంఖణాల వాడికి అడ్డమయినవి పెడతారా" అంటూ కంచంలో కలుపుకున్నవి తీసేసి చారుగిన్నె ముందుకులాక్కు వడ్డించింది. రంగారావు జాలిగా రాజ్యంకేసి చూశాడు. వచ్చే నవ్వుని ఆపుకుంటూ రాజ్యం పక్కకి తిరిగింది.

"అయినా సంసారి లక్షణాలు ఎక్కడైనా వున్నాయా అంట? ఈ కూరకి ఇంతనూనె పోసుకుంటారా? వాడి సంపాదన అంతా ఇల్లా తగలేసేందుకు వచ్చింది, మళ్లీ మహాతల్లి" అంటూ వో పక్కగా చతికలపడి పమిట కొంగు ముందుకు లాక్కుని వేరే తీసిన అన్నం, కంచం ముందుకు జరుపుకుని మూలుగుతూ, "వడ్డించు" అని పురమాయించింది కోడలికి, కాంతమ్మ. "నాక్కూడా వడ్డించు. బట్టకట్టుకొస్తా" నంటూ ఇల్లంతా నీళ్లు వోడుస్తూ తడిబట్టతో ముందుగదిలోకి వెళ్లింది నాగరత్నం. "ఆ కూరపళ్లెం ఇటు తొయ్యి" అంటూ అడ్డంపడి అందుకుంది కాంతమ్మ. తల్లి విస్తరికేసిచూసి వుసూరుమంటూ నాగరత్నం తనూ మొదలుపెట్టింది. కూరపళ్లెం ఖాళీగా వుండడంతో కొబ్బరిపచ్చడి రాచ్చిప్ప దగ్గరికి తీసుకుంది. ఇద్దరూ తిని బ్రేవుమంటూ లేవలేకుండా ఆయాసపడుతూ లేచి వెళ్లారు.

"మంచంకింద వున్న ట్రంకు బయటికి లాగింది నాగరత్నం. "అది ఎందుకే తీస్తావు! మీ వదినపెట్టి" అని నసుగుతూ రంగారావు అన్నాడు.

పడుకున్న కాంతమ్మ లేచి కూర్చున్నావేమిట్రా" అని కొడుకుని అడిగింది కాంతమ్మ.

"వాళ్ల వూరునించి తెచ్చుకుంది" అని ముక్తసరిగా జవాబిచ్చాడు.

తాళాలు పెట్టిమీదే వుండటంతో నాగరత్నానికి మరీ సంతోషంవచ్చి, ఆ తాళం ఈ తాళం పెట్టి ఎలాగో పెట్టి తెరచింది. "ఇవన్నీ ఆవిడవే? ఎన్ని చీరెలు వున్నాయో చూడవే" అంటూ ఏడుపు మొహం పెట్టి తల్లి కేసి చూసింది.

"మీ అన్న సంపాయిస్తున్నాడుగా? ఎన్నేనాకొంటాడు. కన్నతల్లికీ, చెల్లెలికి కొనాలంటే కష్టంగాని, ఆవిడకి కొనకపోతే వురెట్టదూ?" అంటూ కొడుకునీ కోడల్నీ కలిపి సాధించటం మొదలుపెట్టింది.

"నువ్వు అలా అనుకుంటే నేను ఏమి చెప్పనూ? నా కొచ్చేది చాలకపోతే, వాళ్ళ నాన్నకి వ్రాసి తెప్పిస్తోంది. అందుకు వప్పుకొనే, అమ్మాయిని తీసుకొచ్చి ఇవన్నీ కొనిపెట్టి వెళ్ళాడు వాళ్లనాన్న." అంటూ బయటపెట్టాడు రాజ్యాన్ని తీసుకువచ్చిన సంగతి.

"అవును నాయనా! వాళ్ళకి నువ్వే పెద్దవయ్యావు. మా లెఖ్ఖేమిటి? మీ నాన్న కోపంలో అన్నారే అనుకో, పిల్లనిచ్చినవాడు పదిసార్లు తిరిగి బతిమాలాలా వద్దా? అయినా వాళ్ళ తప్పులేదు. నువ్వు వెళ్ళి వాళ్ళలో కలిస్తే వాళ్ళకి మా లెఖ్ఖ ఏమి వుంటుంది? అడప్రాణం కనక మనసులో మధ్య మధ్య పీకితే, మీనాన్నతో కోడల్ని తీసుకురండని చెప్పి ఆయనచేత నాలుగుపడి, నోరు నొక్కుకు వూరుకునేదాన్ని, అయితే ఈ రెండేళ్ళనించీ నీ దగ్గర వుందన్న మాట?" అని ఆరా తీసింది కాంతమ్మ.

"ఇంకా పూర్తిగా నెల కూడా కాలేదమ్మా రాజ్యం వచ్చి" అన్నాడు. వాళ్ల మాటలు వింటూనే కొన్ని చీరలు విడిగా తీసి పెట్టింది నాగరత్నం.

"మీ నాన్న వరస చూద్దామా లోభత్వం ఆరోజుకారోజు పెరుగుతోందే కాని తగ్గదు.

ఒక్కపిల్ల, దానిముద్దు ముచ్చట్లు చూద్దామన్న ఇంగితం ఏకోశానాలేదు. అసలు విషయం చెప్పనేలేదు, మనవూళ్లో దత్తుడుకి పెళ్లయింది ఈ మధ్య. ఆ పెళ్ళికి వచ్చిన వాళ్లలో అతని స్నేహితుడు లండనూ, అవీ వెళ్ళి వచ్చాట్ట, అతనికి చదువుకున్న పిల్లలంటే భయంట, పల్లెటూరి వాతావరణంలో, పెరిగిన పిల్లని, చేసుకుంటానని ఎప్పుడో అన్నాడట. పాపం దత్తుడి అప్పలేదూ? దీన్ని కబురంపి తన చీరకట్టి చూపించింది. తరువాత మీ నాన్నని వప్పించే సరికి వాళ్ళ తాతలు దిగివచ్చారనుకో. చిల్లిగవ్వ కట్నం లేకుండా వప్పుకున్నాడు. లాంఛనాలు కింద వాళ్ళవేపు వచ్చిన పెద్దమనిషి, నాలుగువేలకి తక్కువ వప్పుకోలేదు. పెళ్ళి తిరుపతిలో చెయ్యమన్నారు. ఎల్లుండి తెల్లవారు జామునే ముహూర్తం. నేను ఇక్కడికి మొన్ననే రావల్సింది. బెజవాడలో ఆగిపోవల్సి వచ్చింది. అవధాన్ని కూడా మాతో పంపారు. నువ్వున్న చోటు తనకి తెల్సుకనక తీసుకొచ్చి మమ్మల్ని వదిలి తను వాళ్ళవాళ్ల ఇంటికి వెళ్ళాడు. అతను రాగానే మనం బయలుదేరాలి. దీనికేమయినా మంచివి రెండు చీరలు కొని పెట్టరా?" అని కొడుకును తోలింది కాంతమ్మ. "నాన్న వంద యిచ్చాడు. దానితో రెండు చీరలు కొనుక్కుంటా. మిగిలినవి నువ్వుకొను" అంటూ నాగరత్నం గారంచేసింది అన్నగారి దగ్గర.

"సరే మీ నాన్న ఇచ్చిన వందా పెట్టి గుడ్డలు కొంటే మనం వెళ్లడం ఎట్లా" అంటూ ఆ మాట చెప్పిందని కూతుర్ని కళ్లతో బెదిరించింది కాంతమ్మ.

పనిమనిషిని పంపివచ్చి, రాజ్యం ముందుగదిలోకి తొంగి చూసింది. తన పెట్టెలో బట్టలు చుట్టూ పర్చుకు కూర్చున్న నాగరత్నంమీద కోపం వచ్చి "అదేమిటి? నా పెట్టె కెలుకుతున్నావా" అంటూ మళ్లీ సర్దుకునేందుకు కూర్చుంది రాజ్యం. "నువ్వుకొన్నవేగా ఈ చీరలు? నాకు బాగున్నాయిరా అన్నా" అంటూ కొన్ని తన వొళ్లో పెట్టుకుంది నాగరత్నం. "మరే పాపం మీ అన్నేమీ కొనలేదు అవి అన్ని నావే" అంటూ తీసుకోబోయింది రాజ్యం. అవి ఎలాగా నాగరత్నం ఇవ్వదు. ఎలాగో గొడవలేకుండా సర్దాలనుకొని "నీవైనా, అది మనసు పడుతున్నప్పుడు ఇస్తే తప్పా?" బలిమాలినట్లుగా రాజ్యంతో అన్నాడు రంగారావు.

రంగారావు చెల్లెల్ని వద్దనకుండా, తన్నే ఇవ్వకూడదా అన్నందుకు రాజ్యానికి వళ్లుమండింది. నేను ఇవ్వనంటూ నాగరత్నం రాజ్యం చెయ్యివిసరికొట్టి "నీదేంపోయింది మా అన్న తీసుకోమంటే" అంటూ తల్లిదగ్గరకు వెనక్కి జరిగింది.

ఆ విసురుకు రాజ్యం చెయ్యి పెట్టెకు తగిలి గాజు చిట్లింది. దుఃఖం ముంచుకొచ్చి, చిట్లిన గాజు చేతిలోకి తీసుకొని వంటింట్లోకి వెళ్లింది రాజ్యం.

"నీకూ గుడ్డలపిచ్చి, కనపడ్డవన్నీ కావాలంటావు. అవక్కడ పారేసి మీ అన్నని కొనమను" అంటూ కూతుర్ని కసిరినట్టుగా సలహా యిచ్చింది కాంతమ్మ. అన్న మౌనంగా వుండడంతో "ఆవిడకే కొనుక్కుంటాడులే" అంటూ తన పెట్టెలో పెట్టుకుంది నాగరత్నం.

ఇంతలో అవధాని పేరు పేరు వరసనీ అరుస్తూ పైకి రావడంతో చీరలపేచీ వదలి మాటల్లో పడ్డారు. రంగారావు లేచి, అవధాన్ని కూర్చోమని మడతకుర్చీ ముందుకి జరిపాడు. "సాయంత్రం బస్సువుంది కాని మనకి కొత్తకనక, చీకట్లో వెతుక్కోలేము మరి వాళ్లబస. అందుకని వుదయం బయలు దేరిపోదాం" అని చెప్పాడు కాంతమ్మతో అవధాన్లు.

"ఏమంటావురా అబ్బాయి?" అని అడిగింది కొడుకుని. "మీ ఇష్టం" అంటూ, వంటింట్లోకి వెళ్ళాడు రంగారావు. మోకాళ్ళమీద తలెట్టుకు కూర్చుంది రాజ్యం. ఎలాగో రాజ్యానికి తన బాధ అర్థమయ్యేటట్లు చెప్పాలి మొదలుపెట్టడం ఎలా?

బస్సు దగ్గరికి వచ్చెయ్యమని చెప్పి అవధాన్లు వెళ్ళిపోగానే, నాగరత్నం అన్నగార్ని బజారుకి తీసుకెళ్ళమని నిలవనివ్వడం లేదు.

తల్లినీ, చెల్లెల్ని తీసుకు బజారు వెళ్ళమని రాజ్యాన్ని అడిగాడు. "ఆవిడ వద్దులే బాబూ నువ్వేరా!" అని నాగరత్నం పట్టుపట్టింది. "వాడికి వంట్లో బాగా లేదన్నాడాయె. తెల్లారి బోలెడు దూరం వెడతామా, మొండిపట్టు పట్టకు. మళ్ళీ ఇటు వచ్చి వో వారం వుండి వెడదాములే" అని కూతురికి చెప్పింది కాంతమ్మ. రంగారావు కాస్తస్తిమితపడ్డాడు. రాత్రి భోజనాల వరకూ అంతా తలోమూలా నడుము వాల్చారు. రాజ్యాన్ని తీసుకువెళ్లడంమాట తల్లి ఎత్తుతుందేమోనని చూశాడు. ఆ మాట తప్ప మిగిలినవన్నీ మాట్లాడడం రంగారావుకి కొంచెం కష్టంగా తోచినా పైకి ఏమీ తేలలేదు.

"అన్నయ్య మనతోవస్తే, ఈవిడ ఇక్కడే వుంటుందా?" అని తల్లి నడిగింది నాగరత్నం.

"ఏమో పోనీ తీసుకెడదామన్నా, మీనాన్న పెళ్లి మాని రాద్ధాంతం మొదలుపెడతారు' ' అంది కొడుక్కేసి చూస్తూకాంతమ్మ. "నేనుకూడా మానేస్తే ఏం?" అని రంగారావు తల్లి నడిగాడు. "సరే నీ తమ్ముడు డబ్బు కావాల్సివచ్చినప్పుడు నెత్తిమీద కూర్చుని తీసుకెళ్లడంతప్ప మళ్లీ గుమ్మం తొక్కడంలేదు. నువ్వొరాకపోతే ఒక్కగాను ఆడపిల్ల ఏం బాగుంటుంది." అంటూ గట్టిగా కళ్లువత్తుకుంది కాంతమ్మ.

"నా కోసం ఎవరూ బాధపడఖ్ఖర్లేదు పొద్దున్న మా వాళ్లవూరు వెళ్లిపోతా"నంది కీనీడలో నిల్చున్న రాజ్యం.

తనప్రక్క మెట్లగదిలో వేసుకుంది. గదిలో పడుకున్న కాంతమ్మలేచి, "ఇక్కడే గాలేస్తోందే" అంటూ కోడలికి కొంత దూరంగా పక్క పరుచుకుంది. రాజ్యాన్ని పలకరించాలని చూస్తున్న రంగారావుకి ఇంకేమీ చెయ్యడానికి తోచక నిద్ర పట్టేదాకా ఇటూ అటూ దొర్లుతూ గడిపాడు. రాజ్యాన్ని మళ్లీ రమ్మని చెప్పాలి. ఎలా? వీళ్లు వెళ్లాక తనే వెళ్లి తీసుకొచ్చేందుకు నిర్ణయించుకుని నిద్రపోయాడు. తెల్లవారి లేచిన దగ్గిరనుంచీ ఎవరిహడావిడి వాళ్లదిగావుంది.

రాజ్యం తన పెట్టెలోవున్న రంగారావు బట్టలుతీసి మంచంపైన పెట్టేసింది. తనవి పెట్టెలో దిగులుగా సర్దుకుంటోంది. "చూడు పెట్టె తీసుకెడతావా!" అని రంగారావు అడుగుతున్నాడు. "వోసారి అలా వెళ్లరా అన్నా! బట్ట కుట్టుకోవాలి" అంటూ నాగరత్నం తడిబట్టలతో గుమ్మంలో నిల్చుంది.

అంతా బస్సుస్టాండుకి చేరారు. ముందు చిత్తూరువెళ్లేది సిద్ధంగా వుంది. హారన్ వేస్తున్నాడు డ్రయివర్. రాజ్యాన్ని అందులో ఎక్కించాడు రంగారావు. మాట్లాడేందుకు వ్యవధి లేదు. బస్సు కదిలింది. రాజ్యం కనపడేటంతవరకు చూస్తున్నాడు. తనకేసి చూడనయినా చూడలేదు రాజ్యం. వంటరిగా పంపుతూన్నందుకు కోపమయివుంటుంది. బాధపడుతూ తను ఎక్కే బస్సుదగ్గిరికి వచ్చాడు రంగారావు. అవధాన్లు ఆయాస పడుతూ పక్కచుట్ట పుచ్చుకొని పరుగెత్తుకుంటూ వచ్చాడు బస్సుదగ్గిరికి. "హమ్మయ్య వెళ్ళిపోయిందేమోనని హడిలిపోయాను' ' అన్నాడు లోపలకూర్చుంటూ కాంతమ్మతో.

బస్సు కదిలింది. అవధాన్లు చూడకుండా రాజ్యం బస్సు వెళ్లిపోయినందుకు కాంతమ్మ మనస్సులోనే మొక్కుకుంది దేముడికి. తన కొడుకుని ఒకసారి ఆప్యాయంగా చూసుకుంది. "వెర్రినాగన్న వద్దంటే మాట్లాకుండా పంపేవాడు. ఎంతమంచివాడు. వీడికితగ్గ పిల్లకాదు, గడుగ్గాయిని కట్టబెట్టాడు" అని మధ్యవర్తిని తిట్టుకుంటూ సుఖంగా కునికిపాట్లు పడుతోంది కాంతమ్మ. తన వెనకసీట్లో కూర్చున్న ఆవిడ చీరలాంటిది కొనుక్కోవాలి. ఆవిడ దుద్దులు కదిలినప్పుడల్లా మెరిసిపోతున్నాయి. తనెప్పుడు కొనుక్కుంటుందో తను అదృష్టవంతురాలు. కనుకనే అంత పెద్దచదువు చదివినవాడు తన్ను చేసుకునేందుకు వప్పుకున్నాడు. తను జాగ్రత్తగా వుండి అన్నీ కొనిపించుకోవాలి. భవిష్యత్తుని గురించి, రంగురంగుల కలలు కంటూ

మురుస్తోంది నాగరత్నం.

మైలు రాళ్లు తిరుపతిని దగ్గరికి తెస్తున్నకొద్దీ, రంగారావుకి మనస్సు పీకుతోంది. రాజ్యం వచ్చినరోజు అన్నమాటలు చెవులలో హోరుపెడుతున్నాయి., "మీరు ఇంత మంచిగా వుంటారనుకోలేదు నే వచ్చేటప్పుడు. అమ్మకి నే రావటం ఇష్టంలేదు అయినా మా నాన్నని వప్పించి తీసుకువచ్చేశా. నేను తిరపతివస్తానని మొక్కుకున్నా. అందుకనే మీలో ఇంత మంచి మార్పు వచ్చింది" అని అమాయకంగా తనకేసి చూస్తూ చెప్పడం కళ్లల్లో కదులుతోంది రంగారవుకి.

రాజ్యం వంటరిగా ప్రయాణం చెయ్యడం మొదటి సారేమో, కొంచెం బెరుకుగా కూర్చుంది. మనస్సులో బాధగా వుంది. మళ్లా పుట్టింటికి వంటరిగా వెడుతున్నది. కారణం తల్లికి చెల్లెలికి చెబితే హేళన చెయ్యొచ్చు, చెప్పకూడదని నిర్ధారణ చేసుకుంది. తను వెళ్లిన కొత్తలో ఎంత ఆదరం చూపారో గుర్తుకి వచ్చింది: ఈ మార్పు ఒకరోజులో వస్తుందన్న వూహకికూడా, మనస్సులో తావు ఇవ్వలేకుండా వుంది. పెళ్లికి తీసుకువెళ్లకపోతేమానె, మళ్లా రమ్మని మాటకైనా అనలేదు. అవును! తన్ని రమ్మని ఎవరు ఆహ్వానించారు ఇంతవరకు మట్టుకు తనే వచ్చింది. అలాగే మళ్ళావస్తే వద్దనకపోవచ్చు అనుకుంది. మళ్లా ఈసారి ఏమయినా రమ్మనందే రాకూడదు అనుకుని తనమీద తనే సానుభూతి చూపుకుంది. ఆలోచనలు 'చిత్తూరు వచ్చింది' అన్న కండక్టరు కేకతో ఆగిపోయి. తను దిగి పెట్టిదింపమంది.

రాజ్యం వంటరిగా రావడంచూసి తండ్రి ఎదురువచ్చి 'అత నేడే' అని అడిగాడు. కొద్దిగా నవ్వి వూరుకుని రిక్షా డబ్బులు ఇచ్చి పంపి లోపలికెళ్లింది. తల్లి హాల్లో ఎదురయి "అనుకుంటూనే వున్నా!" రఘు పెళ్లి అంటే ఎగబడి వస్తావని "మీ ఆయన వచ్చాడా" అని అడిగింది రాజ్యాన్ని. "అబ్బే రాలేదు" అని ముక్తసరిగా చెప్పింది. "వూ ఎందు కొస్తాడు! వేలకివేలు గుమ్మరించి, బంగారంలాంటి పిల్లని ఇచ్చినందుకు మేము శత్రువుల్లో జతే. నువ్వు తెగింపు తెచ్చుకువెళ్లినందుకు నిన్నేనా బాగా చూస్తున్నందుకు సంతోషపడాలి" అంటూ కళ్లు తుడుచుకునే తల్లినిచూసి చలించింది రాజ్యం. తనూ కళ్లు తుడుచుకుంది.

"అమ్మడూ" అన్న తండ్రి కంఠంవిని సంతోషాన్ని మొహంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నించింది రాజ్యం. "నీ పెళ్లికే మీ పిన్ని పల్లెటూరు ఇస్తున్నామని నానా హంగామా చేస్తూ ఉత్తరాలు వ్రాసింది. ఇప్పుడు తన కొడుకు దమ్మిడీ కట్నం లేకుండా చదువు, సంగీతం, ఏమీ రాని అమ్మాయిని చేసుకుంటున్నాడు. పెళ్లి రేపు తిరపతిలో చేసుకుంటున్నాడు. పెళ్లికి రానని మీ పిన్ని భీష్మించుకు కూర్చుంది, అని మీ బాబాయి వ్రాశాడు" అని చెప్పి తండ్రి నవ్వుతూ కళ్లలో వచ్చే నీళ్లని పంచెకొంగుతో తుడుచుకోవడం రాజ్యం తేరిబార చూస్తోంది.

"సర్లెండి పోలిక తెచ్చారు. కోడల్ని ఎక్కడనించి తెచ్చుకున్నా, మన యింటికివస్తే మన అలవాట్లు నేర్చుకుంటారు. కొంతకాలానికయినా మార్చుకోవచ్చు. అదే అల్లుడు మారతాడా? మార్చగలము కనుకనా" అని వుసూరుమంది తల్లి. "నువ్వు అల్లా అనుకుంటున్నావు కానీ అమ్మాయి నడుగు మమ్మల్ని చూడగానే ఎంత పొంగిపోయాడో నీ అల్లుడు?" అంటూ తృప్తిగా రాజ్యంకళ్లలోకి చూశాడు తండ్రి. "ఆ తెలుస్తోందిగా అమ్మాయిని వక్కర్తినీ పెళ్లికి పంపడం" అంటూ తల్లి మూతి తిప్పుకుంది "వచ్చేందుకు వీలులేకపోయిందేమో" అంటూ అల్లుణ్ని సమర్థిస్తూ తండ్రి చెప్పడం రాజ్యానికి తృప్తిగా వుంది.

ఆ సాయంత్రం ప్రయాణానికి అంతా సర్దుకుంటున్నారు బట్టలూ నగలూ. తల్లితో మెల్లిగా "పోనీ నేను ఇంటిదగ్గర వుంటా"నంది రాజ్యం. "అదేమిటే మీ పిన్ని, నువ్వు ఇక్కడ వుండి తీసుకురాలేదంటే వూరుకుంటుందా? పోనీ మనిద్దరం పెళ్ళి అవగానే వచ్చేద్దాం" అని

తండ్రి అనడంతో సరేనని వప్పుకుంది రాజ్యం.

రాజ్యం తల్లిప్రక్కన కూర్చుంది బస్సులో. తీరావాళ్లు తననిచూసి ఏమన్నా అంటారేమోనని గుర్తుకిరాగానే వళ్లు చల్లబడ్డట్టు అయింది. ఎన్ని పెళ్లిళ్లు అవుతాయో అక్కడ వాళ్ళని కలుసుకునే అవకాశం వుండకపోవచ్చు. తండ్రి చెప్పాడుగా. పెళ్లి అవగానే వెళ్లిపోతేసరి. అని సమాధాన పడింది రాజ్యం. చెల్లెలు వేసే ప్రశ్నలకి వూఁ వూఁ అంటే సమాధానమిస్తూ పరధ్యానంగా కూర్చుంది రాజ్యం.

మంగాపురం చేరేసరికి, దీపాలువెలిగాయి. తల్లిచెల్లెలు లోపలికి వెళ్ళేరు. సామాను పట్టించుకుని రాజ్యం తండ్రి వెనక మెల్లిగా సత్రములోకి వెళ్లింది.

రఘు ఎదురొచ్చి "చూడు పెదనాన్నా! అమ్మమూర్ఖం కానీ, ఇంతవరకూ వచ్చాక ఇప్పుడు చేసుకోనంటే ఏం బాగుంటుంది? నువ్వు కొంచెం నచ్చచెప్పాలి. అమ్మ ఏమంటే దానికి బాబాయి తాళం వేస్తారు" అని చెప్పి లోపలికి తీసుకెళ్లాడు.

పిల్ల తనకేమీ నచ్చలేదని రాజ్యానికిచెప్పి కళ్లుతుడుచుకుంది పినతల్లి. "చేసుకునేవాడికి నచ్చినప్పుడు మనకి నచ్చక పోయినా ఇబ్బందిలేదు" అని మరదల్ని సముదాయించి "రాజ్యం! నువ్వు వెళ్లి చూసిరావే మీ కాబోయేవదినగార్ని" అని తండ్రి చెప్పడం విని నవ్వింది రాజ్యం. తల్లీ, చెల్లెలూ మేనమామభార్య పిల్లని చూడ్డానికి, ఆత్రంగా పెళ్లివారి సత్రానికి బయలుదేరడంచూసి, వో మూల గట్టుమీద కూర్చుంది రాజ్యం.

తల్లి తిరిగివచ్చే ధోరణి చూస్తే, రాజ్యానికి భయమేసింది. ఏమిజరిగిందో వూహించలేకపోతోంది. "పెళ్లికూతురు ఎవరో తెలుసా?" అంటూ ఆయాసపడుతూ చెల్లెలుదగ్గర కూలబడింది రాజ్యం తల్లి. నా బిడ్డని తీసికెళ్లకుండా, రెండేళ్లూ తొంగిచూడని దాని అత్తగారు నా కాబోయే వియ్యపురాలు. అంతంకంటే చుప్పనాతి శూర్పణఖ నా కాబోయే కోడలు". అని చెప్పి గట్టిగా వూపిరి వదిలింది రాజ్యం తల్లి. అప్పగారి మాటలు వినగానే ఏడుపు కొనసాగించింది పెళ్ళికొడుకు తల్లి. చుట్టూ కొందరు చుట్టాలుచేరి తలోపుల్లా అగ్నిహోత్రంలా వేసి నట్టు సాయపడుతున్నారు.

రాజ్యం మాత్రం కటకటాల్ని పట్టుకు ఆ గట్టుమీదే కూర్చుని దూరంగా వినపడే సన్నాయిని వింటోంది. రఘు వచ్చి రాజ్యం ప్రక్కన కూర్చుని చేతులకైన మట్టిని దులుపుకుంటూ, "ఏమే రాజూ! ఇప్పుడేమి చెయ్యడమే" అని దీనంగా అడిగాడు.

"ఏం చేస్తావు? పెళ్లి చేసుకుంటావు" అని ఆలోచించకుండా అనేసింది. "వీళ్లమాటలు వింటుంటే ఆ అమ్మాయంటే కొంచెం భయం పట్టుకుంది" అన్నాడు అదోలా మొహం పెట్టి తువ్వాలతో నుదురు తుడుచుకుంటూ రఘు.

రాజ్యం రఘు కళ్ళల్లోకి చూసింది. 'నువ్వెందుకు భయపడడం? నీదగ్గర బాగానే ఉంటుందేమో' అని సర్ది చెప్పింది అన్నగారికి.

"నిజమే నువ్వు చెప్పింది. అమ్మాయి ఎలాంటిదయినా మనలో కలిసేటట్లు నేను చెయ్యగలనన్న ధైర్యం నాకుంది అనుకో. నేను అనుకున్న దానికి భిన్నంగా జరిగితే ఏం చెయ్యటమా? అన్న ప్రశ్న ఇప్పుడు కొత్తగా వచ్చింది" అని రఘు రాజ్యంతో అన్నాడు.

'చూడు రఘు' అంటూ తల్లి అక్కడికి వచ్చి కూర్చుంది. 'నీకు కావల్సింది ఆ పిల్లేగా? మమ్మల్ని ఎల్లాగా అతకనివ్వదు. రాజ్యాన్ని తీసుకెళ్లకుండా ఏడిపించారనేనా నీకు అభిమానం లేకుండా పెళ్లికి సిద్దపడుతున్నానంటే నాకు నావాళ్లమీద ఎంత ప్రేమవుందో తెలుస్తుంది' అంటూ కాళ్లు జాపుకూర్చుని, కొంగుతో మెడదగ్గర విసురుకుంటోంది రఘు తల్లి.

రఘు చిరాగ్గా "నాకు ముందు ఇవన్నీ తెలిస్తే వప్పుకునేవాడినకాదు. తెలిసి వప్పుకున్నట్టు

మాట్లాడతావేమిటి?" అని తల్లితో అన్నాడు. "చూడు పిన్నీ, అన్నయ్యని చేసుకుంటే ఆ పిల్ల మారుతుందేమో ఇంక ఇప్పుడు మానెయ్యడం ఏం బాగుంటుంది?" అనే రాజ్యం మాటల్ని కటకటాల అవతల నిల్చున్న రాజ్యం మామగారూ, పెళ్ళి మధ్యవర్తి విని వొకర్ని వకరు చూసుకున్నారు. రాజ్యం తండ్రి వచ్చి వాళ్ళని లోపలికి తీసుకురావడంతో రాజ్యం అక్కడ నుంచి వెళ్ళి పోయింది.

"నాకు చిన్నప్పుడు రెండోపెళ్లి చేశారని రాజ్యం పెళ్ళయ్యాక తెలుసుకున్నాట్ట ఈ పెద్దమనిషి, తెలుసుకు చేసిన ఘనకార్యం ఏమిటో తెలుసా? దాన్ని ఇప్పటిదాకా గడపతొక్కనివ్వలేదు, మరి ఏ మొఖమెట్టుకుని నాకొడుక్కాళ్ళు కడుగుతున్నాడో" అని కసిగా రఘుతో చెప్పుకుంది తల్లి.

రాజ్యం మామగారు ఏదో సమాధానం చెప్పుదామని కండువా దులుపుకున్నాడు. మధ్యవర్తి కళ్లతో వారించాడు.

రఘు తల్లికి విడిదిలోకే తెప్పించారు భోజనం. రాజ్యం కూడా పినతల్లి దగ్గరే కూర్చుంది. పెళ్ళివారి బంతిలో రాజ్యం కోసం వెతుకుతున్నాయి రంగారావుకళ్లు, హైరానపడుతే, శాంతమ్మ వడ్డనచేస్తూ కొడుకుని చూచింది "ఆ సామాజకంలోకే పిల్లనిపంపుతూ నా కోడల్ని తెచ్చుకోకపోవడం నాఖర్మ కాలిందేమిటి? చిన్నపనీ చెయ్యలేక చస్తున్నాను" అంటూ కొడుకు మీద విసుక్కుంది. "నీ కోడలేట పెళ్ళి కొడుక్కి, పెళ్ళికొడుకు తల్లికీ 'నీకూతురు క్షేమంచిది. పెళ్ళిమాని వెళ్ళొద్ద'ని నచ్చచెప్పి ఒప్పించింది" అంటూ మధ్యవర్తి రాజ్యం తల్లి వినేటట్టు గొప్పగా చెప్పాడు కాంతమ్మతో. "మాకోడలు వచ్చిందా? ఏదీ" అంటూ బంతి అంతా కలయచూచింది కాంతమ్మ.

రాజ్యంతల్లి మొదట నాలుగూ అడగాలన్న కచ్చితో కంఠం ఎత్తినా, వియ్యపురాలు సౌమ్యంగా మాట్లాడే ధోరణిని బట్టి, కంఠం సవరించుకుని, "విడిదిలో మా చెల్లెలు దగ్గరవుంది" అని చెప్పింది.

రాజ్యం వో మూల పక్క పరచుకుని పడుకుంది. "ముహూర్తం వేళ అవుతోం"దంటు అంతా హడావిడిగా వెడుతూంటే, రాజ్యం లేచింది. అప్పటికే అందరూ ముస్తాబులు చేసుకు బయలుదేరారు. రాజ్యం, పెళ్లికొడుకు తల్లీ తలైనా దువ్వుకోకుండా పెళ్లికి తరలివెళ్లారు. రంగారావు హడావిడిగా వచ్చినవాళ్లకి మర్యాదలుచేస్తున్నాడు. దూరంగా స్తంభం వెనుకనక్కి కూర్చున్న రాజ్యాన్ని చూసి నవ్వుకున్నా పెళ్లి హడావిడిలో ఆ మాట మరచాడు. రాజ్యం ఎప్పుడో విడిదిలోకి వెళ్లి స్నానం చేసి తండ్రికోసం ఎదురు చూస్తూ కూర్చుంది. "పెళ్లి అయింది కనక మనం కొండమీదికి వెళ్లి వద్దా"మంది తండ్రితో, ఆ మాట విన్న ఇంకా కొందరు వీళ్ల వెంట బయలుదేరారు. రాజ్యం తల్లి రాజ్యంకోసం వెతికితే కొండపైకి వెళ్లారని ఎవరో చెప్పడంతో తనతో చెప్పకుండా వెళ్లినందుకు కూతురుమీద విసుక్కుంది. రఘు స్నేహితుడు మధ్యాహ్నంకల్లా పోవాలి అనడంతో కొండపైకి స్వామిదర్శనానికి ఇప్పుడేవెడదామని రఘు తల్లికి చెప్పాడు. రఘు స్నేహితుడికారులో బయలుదేరాడు.

"అదేమిటి? అన్నింటికి మీ ఇష్టమే. పెళ్లి చేసుకుని వక్కడివి వెళ్ళడమేమిటంట?' అని పెత్తల్లి మందలించి పెళ్లికూతుర్ని కూడా తీసుకు వెళ్లమంది. "అదేమిటి పిల్లని వక్కత్తినీ ఎలా పంపడం రంగా! నువ్వెళ్లరా" అని కొడుకునిపిల్చింది కాంతమ్మ.

రంగారావుకి అందులో అంతాకొత్తే. రఘూని గురించి వినడమే తప్ప ఇంతకుముందు చూడలేదు. వాళ్లలో ఇరుక్కుని కూర్చున్నాడు తల్లి చెప్పిందని.

నాగరత్నం సగం రఘు వళ్లో కూర్చున్నట్టేలెఖ్ఖ. కారు వంపులుతిరుగుతూ పైకి

వెడుతూంటే వింతగా వంగిచూస్తోంది. స్నేహితులు మాటల్లోపడ్డారు. రంగారావు ఎటో చూస్తున్నాడు. నాగరత్నం చీరకొంగు ఎగురుతుంటే పట్టుకునే ప్రయత్నంలో సతమతమవుతోంది. రఘు తలకితగిలి జుట్టును కదుపుతోంది. నుదురుమీదపడే వుంగరాల్ని వేళ్లతో జుట్టులోకి సర్దుకొంటూ నాగరత్నం కొంగుని చేతికి చుట్టుకున్నాడు. రఘు స్నేహితులు చేతులుతడుతూ గోలచేశారు. రంగారావు కూడా కొద్దిగా నవ్వాడు. రఘూ వాళ్ల ధోరణి మార్చాలని "మా రాజ్యం వచ్చివుంటే నాకీబాధ తప్పేది" అన్నాడు రంగారావుతో. నాగరత్నానికి ఆ మాటలు అంత ఇష్టంగాలేదు. మూతిముడుచుకొని కొంగుని అతని చేతినించి విడదీసేందుకు చూస్తోంది. "మీ చెల్లెల్ని కొంచెం కదలకుండా కూర్చోమని చెప్పాలి" అంటూ రంగారావుకి చెప్పి చీరకొంగుతో నాగరత్నం చెయ్యినొక్కి పట్టుకున్నాడు రఘు. కారు కొండపైకి రావడంతో బస్సులో దిగే జనం గుంపుల్లా కనపడ్డారు.

కారు ఆపి అంతా బిగుసుకున్న కాళ్లని స్వాధీనం చేసుకొంటూ లోపలికి వెడుతున్నారు. లోపలికెళ్లే జనంలో రాజ్యం కనపడింది. రంగారావుకి మనస్సు తేలికయ్యింది. మళ్లా ఏమని మొక్కుకొంటుందో అనుకుని నవ్వుకున్నాడు. ఎవరో వచ్చి వీళ్లని, జనాన్ని తప్పిస్తూ కొంచెం ముందుకి తీసుకువెళ్లారు. రాజ్యం బాగా దగ్గరగావున్నా ఎవర్నీ చూడ లేదు. ఆడవాళ్ల వేపు నాగరత్నం జరిగింది. రంగారావు వకసారి స్వామిని, వకసారి రాజ్యాన్ని చూస్తున్నాడు. రాజ్యం రెప్ప ఆర్పకుండా స్వామికేసి చూస్తోంది. అర్చన పూర్తిఅయి హారతి ఇస్తున్నారు. స్వామి సజీవంగా వక్కసారి అందరికళ్లల్లో కదిలి నిల్చినట్టయింది. ఆడామొగా అంతా వోపక్కకిచేరి ముందుకు కదులుతున్నారు.

రాజ్యం వెనక్కి చేరాడు రంగారావు నెమ్మదిగా. హారతిచీటి ఇచ్చింది. మళ్ళా తనివితీరా స్వామిని చూసింది. పూజారి జరగండనే అదిలింపుకి ముందుకి జరుగుతూ దేవుణ్ణి చూస్తూ వెళ్లింది రాజ్యం. ఇవతల మండపంలోనికి వచ్చి కూర్చొని తండ్రికోసం చూస్తోంది. రఘు పెత్తండ్రితో మాట్లాడుతూ రాజ్యం దగ్గరికి వచ్చాడు. వాళ్లతో వచ్చిన వాళ్లు అంతా అక్కడికి చేరారు.

"ఏమే రాజ్యం! మీ ఆయన ఎలాగో కష్టపడి నీ దగ్గరకి చేరితే, నువ్వు చూడనయినా చూడకపోవడం అన్యాయం సుమా!" అంటూ కొంటెగా రంగారావుకేసి చూశాడు రఘు.

వెళ్లడానికి బస్సు సిద్ధంగా వుంది. రాజ్యం తండ్రి "వెళ్ళి పోదామన్నాడు. ఇద్దరికే చోటు వుండడంతో రాజ్యం, తండ్రి వెళ్లారు. రంగారావుకి బస్సులో వెళ్లాలనివున్నా, ఖాళీ లేకపోవడం మళ్లీ వాళ్లలో ఇరుక్కుకూర్చోడం తప్పలేదు. రాజ్యం తన్ను పరాయివాడిలా చూడ్డం రంగారావుకి కొంచెం కోపం వచ్చినా, ఈసారిరానీ అప్పుడు ఏడిపించా లనుకొని సర్దుకున్నాడు.

ఆ సాయంకాలం రాజ్యం, తండ్రీ వెళ్లాలని బయలు దేరితే "ఎందుకు అందరం పొద్దున్న వెళ్ళవచ్చుగా" అని రాజ్యం తల్లి అనడంతో ఆ పూటకి ఆగిపోవలసివచ్చింది. రఘు తల్లి "పిల్లని ఇప్పుడు మనతో తీసుకువెడితే మళ్లా వాడు వచ్చేదాకా మనదగ్గర ఉంటుందా?' ' అని రఘు తండ్రిని అడిగింది.

"వాళ్లు రఘూనే వాళ్లతో తీసుకెడతా మంటున్నారు. ఏదో ఒకటి తేల్చుకోండి తెల్లారి బయలుదేరవచ్చు" అని రఘు తండ్రి చెప్పాడు. రఘుకి సెలవు లేకపోవడం మూలానా, పట్నం అక్కడికి కావాలంటే వచ్చి వెళ్లిపోతానన్నాడు రంగారావుతో. కాంతమ్మకి ఆ సలహా చాలా సంతోషంగా వుంది.

రాజ్యం తల్లీ వాళ్లతో వెళ్లాలని బయలుదేరింది. రంగారావు వచ్చి రఘుని చెల్లెల్ని తనతో తీసుకెడుతున్నాని, రాజ్యాన్ని కూడా పంపమని రాజ్యం తండ్రికి చెప్పాడు. "తనెందుకు

వాళ్లంతా వున్నారుగా?" అంది రాజ్యం. రఘు తల్లిని పెత్తల్లినీకూడా రమ్మని కాంతమ్మ పిల్చినా వెళ్లేందుకు సుముఖంగా లేకపోవడంతో రాజ్యాన్ని వాళ్లతో బస్సెక్కించి వచ్చాడు రాజ్యం తండ్రి.

రంగారావు తండ్రిపక్కన కూర్చోవడంతో రాజ్యంకేసి చూసే ధైర్యంలేక తలవంచు కూర్చున్నాడు.

రఘూకి వాళ్లు అంతా ఒకచోటే కూర్చున్నా, కొయ్యబొమ్మల్లా మాట్లాడక పోవటంచూసి చిరాకేసింది.

ఆ రాత్రి రంగారావు గదిలో రఘూకి పడక ఏర్పరచడం, మధ్యగదిలో కాంతమ్మ సాయంత్రమే పక్క వేసుకోవడంతో రంగారావుకి తన పడక ఎక్కడ అన్న సమస్య వచ్చింది. అవధానికి, తండ్రికీ మధ్య గదిలోనే వేశాడు రంగారావు. కాంతమ్మ కూతురికి ఏవో రహస్యంగా చెప్పి, పాలచెంబు ఇచ్చి పంపింది. రంగారావు ఈజీ చెయిర్ మెట్ల గదిలో వేసుకుని నడుం వాల్చాడు. రాజ్యం వంటగదిలో పొడిగా వున్నచోట పక్క పరచుకుంది. కాని ఎలకల సైన్యం కిందకి దిగటంతో ముడుచు కూర్చున్నది.

తెల్లవారాక నాగరత్నం 'ఇవాళ వెడతారటమ్మా, మళ్లీ రెండు నెలల్లో వస్తారట' అని ఆగి "పోనీ నేనుకూడా వెడితేఏం?" అని నెమ్మదిగా అంది. "అదేమిటే నిన్ను ఎల్లా పంపడం? ఇప్పుడు మళ్లీ తొందర్లోనే వస్తానంటున్నాడుగా!" అని కాంతమ్మ అంది. మళ్లీ బొంబాయినించి బదిలీ అవుతే నేను ఎల్లా చూస్తానమ్మా" గారంగా అంటోంది నాగరత్నం. "నేను ఒప్పుకున్నా మీ నాన్న మండిపడతారు ఈ మాట వింటే" అంది కాంతమ్మ. "నాన్నకి నెమ్మదిగా నువ్వు చెప్పి చూడు వింటా"రంది తల్లితో.

ఇదే సమయం అని రంగారావు "అమ్మ చెప్పింది అక్షరాలా నిజం. మన యింటి ఆనవాయితి తప్పించడం మంచిది కాదు. అధమం ఓ రెండేళ్లు కొత్త కోడలు పుట్టింట్లో వుండాలి. అల్లుడైతే ఈ లోపల ఆ గడప త్రొక్క కూడదు. కోడలయితే మరో కొన్నేళ్లు. అనాది నుంచి వచ్చే ఆచారం" అన్నాడు రంగారావు.

నాగరత్నం రోషంతో వక్క విసురుని లేచి కూర్చుని "నువ్వేం చెప్పనక్కర్లేదు. నాన్నమాట మీద మహా నువ్వు నడిచినట్టు చెబుతున్నావు. ఎవరికీ చెప్పకుండా ఆవిడను తెచ్చుకు కాపరం చేస్తున్నావుగా?" అన్నగారిని అని మాట రాక ఆయస పడుతోంది.

"ఏమిటే గందరగోళం" అంటూ తండ్రి నాగరత్నాన్ని అడిగాడు. "ఏముంది మీ అమ్మాయి అల్లుడితో ఇవాళే వెడతానంటోంది. మీ అబ్బాయి మన యింటి ఆనవాయితి తప్పించక వో రెండేళ్లు వుండమని చెప్తున్నాడు" అని కాంతమ్మ చమత్కారంగా చెప్పాననుకొని నవ్వుకుంది.

"మన పిల్లల దేముందిలే? వాళ్ళ వదిన తెచ్చిన మార్పే" గోడవారగా నిల్చున్న రాజ్యం కేసి చూస్తూ నాగరత్నం తండ్రి కొద్దిగా నవ్వుతూ అన్నాడు.

"మీ నాన్న మల్లా మనుష్యుల ధోరణిలో పడ్డారోయ్ అబ్బాయి" అంది కాంతమ్మ. "మొదట మీ నాన్న సర్దాగానే వుండేవారు. వాళ్ళ నాన్నకి చెప్పకుండా బల్లకట్టుదాటి మా వాళ్ళ యింటికి వచ్చేసేవారు" అంటూ తృప్తిగా ఒకసారి అందరికేసి చూసి "పోన్లే అల్లుడు వల్లనో, కోడలు వల్లనో మారడం కావాలి. ఆయన మారితే ఏం కనక? నాకు చచ్చే చిరాకు ఎక్కువయింది. అది తగ్గుతుందని నాకు తోచదు" అని తన సంగతి చెప్పడం పూర్తి కాకుండానే "ఏమేయ్ కోడలు పిల్లా! అల్లా నిల్చుని మా మాటలు వినకపోతే వెళ్ళి కుపంటి ముట్టించరాదూ' ' అని గంభీరంగా కాంతమ్మ మొహం పెట్టింది. రఘు వచ్చి "మీలో మార్పు మా అమ్మ వచ్చి

వుంటే కలిగేదేమో" అన్నాడు.

సాయంత్రం బొంబాయి రైలుకి రఘు బయలుదేరాడు. నాగరత్నంకూడా సర్దుకూర్చుంది. రఘు వద్దన్నా వస్తానని పట్టు పట్టింది. స్టేషనుకి అంతా బయలు దేరారు. కాంతమ్మ కారు ఎక్కుతుంటే వెనుక నుంచి ఎవరో తుమ్మడంతో అక్కడే మెట్లమీద కూలబడి "మీరు వెళ్ళండి" అని వాళ్లకి చెప్పింది. "నాగరత్నం జాగ్రత్తేవ్" అంటూ కళ్ళు వత్తుకుంటూ, బొడ్డులో దోపుకున్న కొంగువిప్పి కొంతడబ్బు కూతురు చేతిలో పెట్టింది. రైలు కదిలేముందు రఘు ఓ కాగితం ప్యాకెట్టు తీసి రాజ్యం చేతిలో పెట్టాడు.

నాగరత్నం అదేమిటో అన్న కుతూహలంతో రఘు పక్కన ఖాళీ చేసుకు తొంగి చూస్తోంది. రైలు కదిలింది.

రంగారావు నవ్వుతూ "వెడదాం పద" అంటూ రాజ్యం భుజంమీద వేసిన చెయ్యి తండ్రివున్నాడని గుర్తుకురాగానే తేలుకుట్టినవాడిలా తీసేసుకుని ముందుకు నడుస్తున్నాడు. వెనక వచ్చే రాజ్యం తన అసమర్ధతకి నవ్వుతోందేమోనని అనుకున్నాడు. స్టేషను గేటు దాటాక "బండి ఎక్కు" అని సౌమ్యంలేని మామగారి కంఠంలోంచి వచ్చిన మాట వినగానే ఉలిక్కిపడి రాజ్యం బండిలో చేరింది. మైలురాళ్ళ మధ్య ఎడంలా రంగారావు ముడుచుకు కూర్చున్నాడు. ఇద్దరి మధ్యా బండివాడు విశాలంగా జరగడంతో రాజ్యం హద్దుదాటి రంగారావుకి దగ్గరయింది తన ధైర్యం ప్రదర్శిద్దామన్న ఆలోచన పూర్తికాకుండానే బండివాడి ఆజ్ఞతో తండ్రి దగ్గరికి జరిగాడు రంగారావు.

ఇల్లు వచ్చేసినందుకు తండ్రి ఆనందంగా దిగాడు.

"అప్పుడే వచ్చిందే" అన్న మెరపు రంగారావు మొహంలోకి వచ్చి మాయమయింది.

రఘు, నాగరత్నం మాటలు ఎల్లా మొదలు పెడతారో అని వూహించు కుంటూన్న రాజ్యానికి అప్పుడే అంతరాయం వచ్చి నందుకు విసుగు మొహంలో కదిలింది.

మామగారు ముందు మేడపైకి వెళ్ళారన్నధైర్యంతో, వయ్యారంగా కొంగు జరుపుకుంటూ చీకట్లో నెమ్మదిగా మెట్లు ఎక్కుతోంది రాజ్యం.

మెట్ల మలుపు దగ్గర రాజ్యం చెవి పట్టుకు ఆపి "ఇప్పుడు ఏమనుకుంటున్నట్టు నన్ను గురించి" అన్నట్టు రాజ్యం కళ్ళల్లోకి చూశాడు రంగారావు.

దూరంగావున్న వీధి దీపం ఇచ్చిన కాంతి రాజ్యం కళ్ళ మీదికి కొద్దిగాచేరి "ఇంత పిరికివారా" అన్న ప్రశ్న మెరిసినట్టు అయింది రంగారావుకి. "నిజమే తనకి అన్నీ వున్నాయి ఏం లాభం ఇంకా కొంచెంచొరవ, ధైర్యం వుంటే ఎంత బావుండునో" అని నిట్టూరుస్తూ రాజ్యం వెనక నడుస్తూ మేడపైకి చేరాడు రంగారావు.

✧